క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

నేటి నుంచి గిరిజన సంత

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎమ్) భవన్ ప్రాంగణంలో శనివారం నుంచి గిరిజన సంత నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి మందా ఓ ప్రకటనలో తెలిపారు. జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్న సంతలో గిరిజన ఉత్పత్తులు లభిస్తాయని పేర్కొన్నారు.

గీతంలో అధునాతన పరికరాలతో దంత వైద్యం

కొమ్మాది: సామాన్య ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో అధునాతన దంత వైద్య పరికరాలను ఉపయోగించి చికిత్స అందించడానికి గీతంలో ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభించనున్నట్లు ప్రో.వీసీ డా. బి.గీతాంజలి తెలిపారు. నోటి ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెంచడానికి వైద్యులు కృషి చేయాలని సూచించారు.

కళాసాహితికి మైక్‌సెట్ అందజేత



సంస్థ సభ్యులకు మైక్‌సెట్‌ను అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి సంస్థకు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యులు శుక్రవారం మైక్‌సెట్‌ను బహూకరించారు. ఫ్యాబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాళ్ల సన్నీ తన తండ్రి కాళ్ల నారాయణ రావు జ్ఞాపకార్థం సమకూర్చిన ఈ మైక్‌సెట్‌ను కళాసాహితి అధ్యక్షుడు పాత్రూరు రాజేంద్రప్రసాద్ వర్మకు అందజేశారు. ఈ సందర్భంగా సన్నీ మాట్లాడుతూ కళాసాహితి సంస్థ పలు సమావేశాలు, ఇష్టాగోష్ఠి కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వారి అవసరార్థం ఫ్యాబ్ తరపున దీనిని అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాబ్ సభ్యులు ముసునూరి శ్రీనివాస రావు, గుగ్గిళ్ల పార్వతీశం, మారోజు గోపి, ఎల్.వి.వి.విద్యాసాగర్, విజ్జపు సత్యనారాయణ, డాక్టర్ కాళ్ల లావణ్య పాల్గొన్నారు.

180 మందికి వైద్య పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

పద్మనాభం: మండలంలోని కురపల్లిలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో 180 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సాధారణ వ్యాధులకు సంబంధించిన రోగులను ఎస్.జయ సాయి చందు, కంటి రోగులకు ఎంఎస్ఎల్ రాజు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ వి.కిరణ్ కుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ కర్రోతు దుర్గరాజు, ఉపాధ్యాయులు శ్రావణి, బ్యూల పాల్గొన్నారు.

అధ్వాన దారిలో అవస్థల ప్రయాణం

రేవళ్లపాలెం రోడ్డంటే హడలిపోతున్న ప్రయాణికులు

- గుంతలు, మురుగుతో తరచూ ప్రమాదాలు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు



పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో రహదారి దుస్థితి



డ్రైనేజీలు లేక అపార్ట్‌మెంట్ల నుంచి వస్తున్న మురుగు

తగరపువలస: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గం ద్వారా బక్కన్న పాలెం, కొమ్మాది నవోదయ, కే1, కే2, కే3 కాలనీలకు చెందిన సుమారు 700 అపార్ట్‌మెంట్ల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా ఈ మార్గంలో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు.

- పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో డబుల్ రోడ్డును విభజించే ప్రధాన రహదారిపై గోతులు మురుగుతో నిండిపోయాయి. విశాఖ షాపింగ్ కూడలి, రేవళ్లపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రయాణించేవారు ఈ గోతుల కారణంగా తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.
- కొన్ని అపార్ట్‌మెంట్లకు సరైన డ్రైనేజీ సదుపాయాలు లేకపోవడంతో, వీటి నుంచి వచ్చే మురుగునీటితో రహదారి నిండిపోతోంది. దీంతో స్థానికులు రేవళ్లపాలెం సచివాలయ సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారానికి మాత్రం నోచుకోలేదు. ఈ గుంతల మార్గంలో పాదచారులు నడవడానికి సైతం సాహసించడం లేదు.



విశాఖ షాపింగ్ కూడలి వద్ద డబుల్‌రోడ్డులో గోతులు

చినుకు పడితే చెరువే..

రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో పొడి వాతావరణంలో దుమ్మూధూళి రేగి వాహనదారుల కళ్లు మండుతుంటే.. వర్షాకాలంలో రెండు చోట్ల చెరువులను తలపిస్తోంది. సాధారణ రోజుల్లోనే వాహనదారులు గోతుల్లో బోల్తా పడుతుండగా.. ఇక వర్షం కురిసిన సమయంలో గోతులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోలేక సతమతమవుతుంటారు. దీనికి తోడు వర్షంనీటిలో అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే మురుగు కలిసి గలీజుగా మారిపోతోంది. భీమిలి నియోజకవర్గానికే గుండె వంటి మధురవాడ జోన్‌లో ఇలాంటి దుస్థితి ఏమిటని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మధురవాడ జాతీయరహదారి నుంచి రేవళ్లపాలెం మీదుగా బక్కన్నపాలెం వెళ్లే రహదారికి మరమ్మతులు నిర్వహించాలని 6వ వార్డు ప్రజలు కోరుతున్నారు.



డబుల్‌రోడ్డు సమీపంలో నిలిచిన మురుగు

ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాను



రోడ్డు బాగా లేకపోవడంతో మా కళ్ల ముందే ప్రమాదాలు జరుగుతున్నాయి. వేలాదిమంది సంచరించే మార్గం కావడంతో మరమ్మతులు చేయించాలని వార్డు సచివాలయ, జోనల్ అధికారులను కోరుతూనే ఉన్నాం. ఇప్పటికైనా స్పందించి రోడ్డు బాగు చేయాలి.

– పోలిపల్లి శామ్యూల్ విలియమ్స్, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్

ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే



మధురవాడ జోన్‌లో ఎక్కువ మంది ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. కానీ రోడ్డు నిర్వహణ అధ్వానంగా ఉంటుంది. మురుగు, ధూళి కారణంగా రాకపోకలు సాగించేటప్పుడు ముక్కు మూసుకుని రావలసి వస్తోంది.

– నందిక సురేష్

ప్రజల సమస్యలను పట్టించుకోవాలి



తరచూ ఈ మార్గంలో ప్రయాణించేవారు రహదారి దుస్థితిని చూసి బాధపడుతున్నారు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు దీని ప్రాధాన్యతను గుర్తించడం లేదు. ప్రజలు ఎంతమంది ఇబ్బంది పడుతున్నారో చూస్తే తెలుస్తుంది.

– గొలగాని సాయి

ముగిసిన సిద్ధేశ్వర పీఠం స్వర్ణోత్సవాలు

కమనీయంగా శివ పార్వతుల కల్యాణం



నాగాభరణం బహూకరిస్తున్న రమేష్ దంపతులు

మధురవాడ: సిద్ధేశ్వర పీఠంలో స్వర్ణోత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు హోమాలు, ఆధ్యాత్మిక ఆరాధనా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆఖరి రోజు శుక్రవారం ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రామలింగస్వామి శర్మతో పాటు టీటీడీ పండితులు హోమాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా రుద్రహోమం జరిపించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగాభరణం బహూకరణ

మధురవాడకు చెందిన భక్తులు బి.రమేష్, జగదీశ్వరీ దేవి దంపతులు సిద్ధేశ్వర స్వామికి వెండి నాగాభరణం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్‌సీడీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

పద్మనాభం: ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని రేవిడిలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా బీపీ, షుగర్, ఓరల్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధ పడుతున్న వారిని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయాన్ని సందర్శించారు.

హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధి భరద్వాజ్

భీమునిపట్నం: హిందూ దేవాలయాలను పరిరక్షించుకునే బాధ్యత హిందువులందరిపై ఉందని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి పప్పు భరద్వాజ్ అన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి సంబంధించి స్థానిక వీరాంజనేయ అయ్యప్ప సేవాపీఠం వద్ద భక్తులకు తెలియపరచడానికి విచ్చేసిన ఆయన మాట్లాడారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి లేకపోవడం వల్ల అవి సరైన పద్ధతిలో అభివృద్ధి, గుర్తింపు పొందలేకపోతున్నాయన్నారు. ముఖ్య ఆలయాల నిర్వహణను ప్రభుత్వం చేయడం చేయడం వల్ల చాలా సమస్యలు వస్తున్నాయని.. వాటి ఆస్తులు, నిర్వహణ సరిగ్గా ఉండడం లేదని అన్నారు. దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా ఆలయాల అభివృద్ధికి సరైన రీతిలో వెచ్చించడం లేదని, ఇది చాలా బాధాకరమని పేర్కొన్నారు. దేవాలయాల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి నిర్వహించనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సేవా పీఠం నిర్వాహకులు ఎర్రినాయుడు, కదిరి జగన్నాథం, మొకర నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

తుప్పలు తొలగించాలి

- సచివాలయానికి వెళ్లడానికి స్థానికుల అవస్థలు



రోడ్డుకు ఇరువైపులా తుప్పలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు వివేకానంద నగర్ సచివాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు తెలిపారు. సచివాలయానికి వెళ్లాలంటే భయంగా ఉంటోందని, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తుప్పలు తొలగించాలని కోరారు.

షాపు అక్రమం.. ఏడీసీ ఆశీర్వాదం..!

- అక్రమ నిర్మాణ షాపు ప్రారంభోత్సవానికి జీవీఎంసీ ఏడీసీ
- టీడీపీ ప్రజా ప్రతినిధి బంధువులది కావడంతో అంతా గప్‌చుప్



షాపు ప్రారంభోత్సవంలో పాల్గొన్న జీవీఎంసీ ఏడీసీ, క్రికెటర్ శ్రీకర్ భరత్

మధురవాడ: నిబంధనలకు విరుద్ధంగా, కనీస అనుమతులు లేకుండా భారీ షెడ్‌లో ఏర్పాటు చేసిన మల్టీ కార్ కేర్ ప్రారంభోత్సవానికి జీవీఎంసీ ఏడీసీ, ఇండియన్ క్రికెట్ శ్రీకర్ భరత్‌తో కలసి హాజరు కావడం స్థానికులను విస్మయానికి గురి చేసింది.

జీవీఎంసీ 6వ వార్డు సాయిప్రియ రోడ్డులో బక్కన్నపాలెం వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డుకు ఒక అపార్ట్‌మెంట్‌కు మధ్య సుమారు 300గజాలు పైన విస్తీర్ణంలో ఎటువంటి వీఎల్‌టీ, ప్లాన్ లేకుండా భారీ షెడ్ నిర్మాణం చేశారు. ఇది టీడీపీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి తాలూకా వారిది అని చెప్పడంతో నిబంధనలేమీ లేకున్నా.. జీవీఎంసీ అధికారులెవరూ దీనివైపు కన్నెత్తి కూడా చూడలేదన్న విమర్శలున్నాయి. పైగా ఆ షెడ్‌లో ఏర్పాటు చేసిన షోరూం ప్రారంభోత్సవానికి ఉన్నతస్థాయి అధికారి హాజరు కావడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇటీవల మధురవాడలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అక్రమ నిర్మాణాల విషయంలో కొందరు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ప్రోత్సహిస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన ఏడీసీ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్ ప్రారంభోత్సవానికి హాజరు కావడం అందరినీ విస్మయపరిచింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ స్థాయి అధికారే వత్తాసు పలికితే, కింది స్థాయి అధికారులు, సిబ్బంది పరిస్థితి ఏమిటని ముక్కున వేలేసుకుంటున్నారు.

రాకపోకలకు దారేది?

- రహదారిపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- స్థానికుల ఇబ్బందులు



సంగివలస సుఖీభవ కాలనీ రహదారిపై నిలిపి ఉంచిన కారు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో రహదారులపై వాహనదారులు ఇష్టం వచ్చినట్టు తమ వాహనాలను పార్క్ చేయడంతో పలువురు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్‌ల కోసం వాహనాలపై వచ్చేవారు సర్వీస్‌రోడ్లను బ్లాక్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా తమ వాహనాలను రోడ్ల పక్కన, మధ్యలో అడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో మిగిలిన వారు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం సంగివలస సుఖీభవ కాలనీలోని రోడ్డులో ఒక వైద్యుడు ఇదే విధంగా రోడ్డు మధ్యలో కారు నిలిపివేశాడు. స్థానికులు అడ్డు తీయమని చెప్పినా, వారే వెళ్తారంటూ నిర్లక్ష్యంగా టిఫిన్ దుకాణంలోకి వెళ్లిపోయాడు. దీంతో మిగిలిన వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా సదరు వైద్యుడు జారుకున్నారు.

డ్రైనేజీలో చిక్కుకున్న ఆవు



డ్రైనేజీ నుంచి ఆవును బయటకు తీయడానికి ప్రయత్నిస్తున్న స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయాన్ని ఆనుకుని ఉన్న పెద్ద డ్రైనేజీలోకి ఒక ఆవు శుక్రవారం ప్రమాదవశాత్తు పడిపోయింది. ఐదు అడుగుల లోతైన ఈ డ్రైనేజీకి ఇరువైపులా బీటీ రోడ్డు ఉన్నా ముఖద్వారం వద్ద ఎలాంటి రక్షణగోడ లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ, ద్విచక్రవాహనదారులు సైతం ప్రమాదానికి గురవుతున్నారు. ఆవును చిట్టివలసకు చెందిన దాని యజమానులు అతి కష్టం మీద తాళ్ల సాయంతో బయటకు తీయగలిగారు. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు రక్షణగోడ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ట్రాలర్

- ట్రాలర్‌ను ఢీకొన్న లారీ
- ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన ట్రాలర్



హైవేపై నుంచి పక్కకు తొలగించిన గ్రానైట్ రాళ్లు

పీఎంపాలెం: ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా హైవేపై శుక్రవారం తెల్లవారుజామున భారీ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. నార్త్ ఏసీపీ సాయి తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం నుంచి నగరం వైపునకు భారీ గ్రానైట్ రాళ్ల లోడుతో ట్రాలర్ వస్తోంది. ఈ క్రమంలో ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలర్‌పై ఉన్న గ్రానైట్ రాతి దిమ్మలు రోడ్డుపై పడిపోయాయి. అదే సమయంలో నగరం వైపు నుంచి ఆనందపురం వైపునకు వెళుతున్న లారీ ట్రాలర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ట్రాలర్ ముందుభాగం నుజ్జయింది. ట్రాలర్ డ్రైవర్, క్లీనర్ గాయాలు కాగా.. వారిని చికిత్స నిమిత్తం గాయత్రి ఆస్పత్రికి తరలించారు. వేకువజాము కావడంతో వాహనాల రద్దీ స్వల్పంగా ఉంది. రోడ్డుకు అడ్డ దిడ్డంగా ఉన్న గ్రానైట్ రాళ్లను, ట్రాలర్‌ను పోలీసులు క్రేన్ సాయంతో తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పరిస్థితిని చక్కదిద్దారు.

గోస్తని తీరం కలుషితం

పందుల పెంపకంతో స్థానికుల్లో ఆందోళన



గోస్తనినదిని ఆనుకుని వ్యర్థాలను దువ్వుతున్న పశువులు



నది పక్కనే పాకలో పందులు, పశువులు

తగరపువలస: జీవీఎంసీ, విజయనగరం మున్సిపాల్టీ, భీమిలి, పద్మనాభం, ఆనందపురం, భోగాపురం, డెంకాడ మండలాల్లోని పలు పంచాయతీలకు తాగునీటి ప్రధాన వనరు గోస్తని నది. ఈ తీరంలో బోరుబావులు, ఊటబావులు నిర్మించి, నీటిని సేకరించి ఆయా గ్రామాలకు తరలిస్తుంటారు. అయితే ఇక్కడ కొందరు పెంపకందారులు పందులను పెంచుతుండడంతో నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నది దిగువన ముందే కలుషితం

2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భీమిలి జోన్‌లోని మురుగునీటిని బంగ్లామెట్ట, చిట్టివలస వద్ద గోస్తని నదిలోకి మళ్లిస్తూ డ్రైనేజీలు నిర్మించింది. దీంతో తగరపువలస నుంచి దిగువకు అంటే చిట్టివలస, మూలకుద్దు, భీమిలి వరకు గోస్తనినది మురుగునీటితో కలుషితం అయిపోయింది.

ఎగువ ప్రాంతంలో పందుల పాకలు

ప్రస్తుతం గణపతి నవరాత్రులు, శరన్నవరాత్రులు నిర్వహించే ఉత్సవ కమిటీలు విగ్రహాలను తగరపువలస నుంచి ఎగువకు టి.నగరపాలెం, తాటితూరు, మజ్జివలస వైపు వెళ్లి తీసుకువెళ్లి నదిలో నిమజ్జనం చేస్తుంటారు. కార్తీకమాసంలో స్నానాలు, దీపాలు వదలడం వంటివి ఈ తీరంలోనే చేస్తుంటారు. ఇప్పుడు అక్కడి నీటి పవిత్రతపై కూడా పందుల పెంపకందారులు నీళ్లు చల్లారు. గతంలో గోస్తనినదిని ఆనుకుని ఎల్లారమ్మమెట్ట–బాలాజీనగర్ మధ్య పందులను పెంచిన వాటి యాజమానులు వ్యర్థాలు నదిలో కలిపేసేవారు. టి.నగరపాలెం వాసులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో తాత్కాలికంగా పందుల పెంపకాన్ని నిలిపివేశారు. ఇప్పుడు సంగివలస–పాండ్రంగి రహదారిలో నదికి ఆనుకుని టి.నగరపాలెం–తాటితూరు పంచాయతీల సరిహద్దులో పందుల పాకలు వెలిశాయి. నదిని ఆనుకుని ఉన్న ఈ ప్రదేశంలో పందుల కోసం తెచ్చిన వ్యర్థాలు, వాటి మలమూత్రాలు కలుస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యర్థాలు కలిసే చోటే డీవీస్ లేబరేటరీ తాగునీటిని తరలిస్తోంది. అంతేకాకుండా నదిలో కలిసే వ్యర్థాలు టి.నగరపాలెం దిగువ ఊటబావులు, స్నానాలఘాట్‌లు ఉన్నాయి. ఈ వ్యర్థాలు నీటిలో ప్రవహించి ఈ పవిత్రమైన ప్రాంతాలు కూడా కలుషితం అవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నదీతీరాన్ని ఆనుకుని ఉన్న పందుల పెంపకందారులను తరలించాలని భీమిలి మండల ప్రజలు కోరుతున్నారు.

అమ్మోరి అలంకరణలో ఆదిదేవుడు



అమ్మవారి అలంకరణలో శివలింగం

పీఎం పాలెం: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా కారుషెడ్ సమీపంలోని శ్రీ కాశీ ఉమామహేశ్వ స్వామి ఆలయంలో నిత్య పూజలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం శివలింగాన్ని అమ్మవారిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

కార్మిక నాయకుడు రాము మృతి



రాము (ఫైల్)

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకుడు అలంక రాము అనారోగ్యం కారణంగా శుక్రవారం కొత్తపేటలో మృతి చెందారు. మిల్లులో ఫినిషింగ్ విభాగంలో సంఘంలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన రాము మృతిపై సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.